సాక్షి గుంటూరు

మంగళవారం | 4 | జూలై | 2023



కలెక్టరేట్‌లో గురుపౌర్ణమి

నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం వ్యాసమహర్షి జయంతి (గురుపౌర్ణమి) సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్ పూలమాలలు వేశారు.



బగళాముఖి సేవలో..

పిట్టలవానిపాలెం: చందోలు శ్రీ బగళాముఖి ఆలయానికి ఏపీ హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ పద్మావతి పఢ్నవీర్ కుటుంబ సభ్యులతో విచ్చేశారు. ప్రత్యేక పూజలు చేశారు.



తిరుపతమ్మకు విరాళం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ ఆలయంలోని అంకమ్మ ఉపాలయం వెండి తాపడం తయారీకి సోమవారం జయంత్ సాయి రూ.1,00,116 విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

ప్రైవేటు రా'బడులు'పై విద్యాశాఖ సీరియస్

320 ప్రైవేటు స్కూళ్లకు షోకాజ్ నోటీసుల జారీకి నిర్ణయం

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను కొనుగోలు చేయని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న అనధికారిక పాఠ్య పుస్తకాల విక్రయంతోపాటు, ప్రభుత్వం ముద్రించిన పాఠ్య పుస్తకాల కొనుగోలుకు ముందుకు రాని యాజమాన్యాల తీరుపై ''సాక్షి'' జిల్లా టాబ్లాయిడ్‌లో సోమవారం ప్రచురించిన ప్రైవేటు రా'బడులు' కథనంపై ఆమె స్పందించారు. జిల్లాలో 320 ప్రైవేటు స్కూళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలకు తక్షణమే ఆన్‌లైన్ ఇండెంట్ ఇవ్వాలని యాజమాన్యాలను ఆదేశించారు. లేకుంటే నిబంధనల మేరకు చర్యలు చేపడతామని హెచ్చరించారు.

నేడు గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్-3 పరిధిలో ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు గ్రేడ్-2 హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నట్లు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 38 గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టుల ఉద్యోగోన్నతుల కోసం 31-3-2006కు ముందుగా విధుల్లో చేరిన స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్ ఉపాధ్యాయులతోపాటు 10-2-2009కి ముందుగా విధుల్లో చేరిన స్కూల్ అసిస్టెంట్ ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ ఉపాధ్యాయులు తమ సేవా పుస్తకాలు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతల సర్టిఫికెట్లతో గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు.

నేడు జెడ్పీ హెచ్‌ఎం ఉద్యోగోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ యాజమాన్యంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు అర్హులైన అభ్యర్థుల జాబితాను డీఈవోజీఎన్‌టీ. బ్లాగ్‌స్పాట్.కామ్‌లో పొందుపర్చినట్లు డీఈవో పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలోని స్కూల్ అసిస్టెంట్లు విద్యార్హతల సర్టిఫికెట్లు, సేవా పుస్తకంతో మంగళవారం మధ్యాహ్నం 2.00 గంటలకు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో హాజరు కావాలని సూచించారు. ఈ విషయమై ఉమ్మడి జిల్లాలోని డీవైఈవోలు, ఎంఈవోలు,హెచ్‌ఎంలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.60 అడుగుల వద్ద ఉంది. ఇది 148.5482 టీఎంసీలకు సమానం. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 7,459, ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. మొత్తం ఔట్‌ఫ్లో 8,359 క్యూసెక్కులు. శ్రీశైలం జలాశయం నుంచి 8,359 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 808.50 అడుగుల వద్ద ఉంది. ఇది 33.4364 టీఎంసీలకు సమానం.

5 నుంచి గురుకుల జూనియర్ కళాశాలల్లో 3వ విడత ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 3వ విడతలో ప్రవేశాలను ఈనెల 5, 6, 7 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులకు ఈనెల 5,6,7 తేదీల్లో ఆంధ్ర, 6న రాయలసీమ ప్రాంతాల్లో వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి, కళాశాలలను కేటాయిస్తామని పేర్కొన్నారు. తాటిపూడి, నిమ్మకూరు, నాగార్జునసాగర్, గుంటూరు (మైనార్టీ) వెంకటగిరి కళాశాలల్లో ఎంపీసీ, ఈఈటీ గ్రూపులకు ఈనెల 5న, బైపీసీ, సీజీటీ గ్రూపులకు ఈనెల 6న, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు ఈనెల 7న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే కర్నూలులోని మైనార్టీ బాలురు, గ్యారంపల్లి, కొడిగెనహళ్లిలోని మైనార్టీ బాలికల కళాశాలలతోపాటు వాయల్పాడులోని బనవాసి మైనార్టీ కళాశాలలో అన్ని గ్రూపులకు ఈనెల 6న కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తామని వివరించారు. నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కళాశాలలో అన్ని గ్రూపులకు ఈనెల 7న కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

కల నెరవేరే వేళ

- జాతీయ రహదారిగా కొండమోడు-పేరేచర్ల రోడ్డు
- విస్తరణకు చురుగ్గా అడుగులు
- నాలుగు మండలాల్లో 464.28 ఎకరాల భూ సేకరణ
- మూడు మండలాల్లో 19.6 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్ల నిర్మాణం
- నేడు, రేపు సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఆరు గ్రామాల రైతులతో సమావేశం
- హాజరు కానున్న పల్నాడు జేసీ శ్యామ్ ప్రసాద్



పేరేచర్ల-కొండమోడు ప్రధాన రహదారి

సత్తెనపల్లి:గుంటూరు-హైదరాబాద్ ప్రధాన మార్గంలోని గుంటూరు జిల్లా పేరేచర్ల నుంచి పల్నాడు జిల్లా కొండమోడు వరకు ఉన్న రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. రద్దీకి తగినట్టు ఈ మార్గం విస్తరణ జరగకపోవడంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే ప్రజలు హడలిపోయే దుస్థితి వచ్చింది. ఫలితంగా ఈ దారిని విస్తరించాలని ఎన్నో ఏళ్ల నుంచి డిమాండ్ ఉన్నా.. గత పాలకులు పట్టించుకోలేదు. రహదారి విస్తరణ జరిగిపోతుందని కాగితాల్లో చూపించారే తప్ప వాస్తవ రూపం దాల్చలేదు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని నేషనల్ హైవే జాబితాలో చేర్పించారు. అనేకమార్లు కేంద్రమంత్రులను కలిసి రహదారి ప్రాధాన్యాన్ని వివరించి నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు కృషి చేశారు. ఫలితంగా ప్రస్తుతం రహదారి విస్తరణకు చురుగ్గా అడుగులు పడుతున్నాయి. దీంతోపాటు మేడికొండూరు, సత్తెనపల్లి, కొండమోడు వద్ద బైపాస్ రోడ్లు నిర్మించేందుకూ అధికార యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించింది.

విస్తరణ ఇలా..

తాడికొండ నియోజకవర్గంలోని మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం కొండమోడు వరకు 49.91 కిలోమీటర్ల ప్రధాన రహదారి ఇది. దీనిని నాలుగు వరుసలుగా 45 మీటర్ల వెడల్పున విస్తరించేందుకు 464.28 ఎకరాలు సేకరించాలని అధికారులు నిర్ణయించారు. మేడికొండూరు మండలంలో 87.55 ఎకరాలు, సత్తెనపల్లి మండలంలో 175.25 ఎకరాలు, ముప్పాళ్ళ మండలంలో 64.96 ఎకరాలు, రాజుపాలెం మండలంలో 136.52 ఎకరాలు భూసేకరణలో ఉంది. ఇదికాక పిడుగురాళ్ళ, బెల్లంకొండ మండలాల్లో కొంత భూమి సేకరించాలి. భూసేకరణ కోసం మూడు బృందాలు సర్వే పనులు ముమ్మరంగా చేపట్టాయి. ప్రభుత్వ, పట్టా భూములను గుర్తించడంతోపాటు పలు సర్వే నంబర్లలో రైతుల వివరాలను నమోదు చేశాయి.

రైతులతో సమావేశాలు

పేరేచర్ల-కొండమోడు రహదారి విస్తరణకు సంబంధించి భూములు కోల్పోతున్న 12 గ్రామాలకు చెందిన 572 మంది రైతులతో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సమావేశాలు నిర్వహించి పరిహారం విషయమై చర్చిస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే గత నెల 27న పిడుగురాళ్ళ తహసీల్దార్ కార్యాలయంలో పిడుగురాళ్ల మండలానికి సంబంధించి 28 మంది రైతులతో, బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయంలో బెల్లంకొండ మండలానికి సంబంధించిన 20 మంది రైతులతో, గత నెల 30న రాజుపాలెం తహసీల్దార్ కార్యాలయంలో రాజుపాలెం మండలం కుబాద్‌పురానికి చెందిన 66 మంది, చౌటపాపాయ పాలెంకు చెందిన 29 మంది, రాజుపాలెంకు చెందిన 38 మంది, రెడ్డిగూడెంకు చెందిన 81 మంది రైతులతో సమావేశమయ్యారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్లకు చెందిన 91 మంది, కంకణాలపల్లికి చెందిన 21 మంది, సత్తెనపల్లికి చెందిన ఒకరు, ఈ నెల 5న వడ్లవల్లికి చెందిన 77 మంది, నందిగామకు చెందిన 65 మంది, కంటెపూడికి చెందిన 55 మంది రైతులతో సమావేశం కానున్నారు.

మూడు బైపాస్‌లు ఇలా..

పేరేచర్ల-కొండమోడు ప్రధాన రహదారి నాలుగు వరుసలుగా విస్తరించనున్న నేపథ్యంలో మూడు మండలాల్లో 19.6 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు నిర్మించనున్నారు.

- మేడికొండూరు మండలంలో గుంటూరు-నరసరావుపేట మార్గంలోని డోకిపర్రు నుంచి మేడికొండూరులోని దర్గా వరకు 5.5 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.
- సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు సమీపంలోని బచ్చగుంట నుంచి ధూళ్ళిపాళ్ల రెవెన్యూ గ్రామ పరిధిలోని గిడ్డంగుల వరకు 11.2 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు రానుంది.
- రాజుపాలెం మండలం అనుపాలెం సమీపంలోని ఆర్వోబీ నుంచి కొండమోడుమీదుగా పిడుగురాళ్ళ బైపాస్ రోడ్డును కలుపుతూ 2.9 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మితం కానుంది.



బస్సు యాత్ర సందర్భంగా బాహాబాహీకి దిగిన తెలుగుదేశం పార్టీ నాయకులు

'పచ్చ' రచ్చ

- భగ్గుమన్న విభేదాలు
- తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ
- భవిష్యత్ గారెంటీ బస్సు యాత్ర సాక్షిగా రోడ్డెక్కిన నేతలు
- నగర అధ్యక్షుడు, తూర్పు ఇన్‌చార్జి మధ్య ప్రొటోకాల్ తగాదా
- బస్సు యాత్రలో గందరగోళం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు అర్బన్ తెలుగుదేశం పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. భవిష్యత్ గ్యారంటీ బస్ యాత్ర సాక్షిగా తెలుగుతమ్ముళ్లు రోడ్డెక్కారు. తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ వైఖరిని పలువురు ఎత్తి చూపి నిలదీయడంతో యాత్ర మొత్తం రసాభాసగా సాగింది. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జరిగిన టీడీపీ భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్యరథ యాత్రలో మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజా, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, తూర్పు ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద అమ్మవారికి పూజలు చేసి, బస్సు యాత్ర ప్రారంభించారు. యాత్ర జిన్నా టవర్ సెంటర్‌కు వచ్చేసరికి 'వన్‌టౌన్ టైగర్ నసీర్ అహ్మద్, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్' అంటూ ఆయన వర్గం ప్లకార్డులు పట్టుకోవడంతో మిగిలిన వారు విభేదించారు. ఇది సొంత యాత్ర కాదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. చందనా బ్రదర్స్ సెంటర్‌కు చేరుకునే సరికి పార్టీలోని ఇంకో వర్గం ర్యాలీగా రావడంతో వారిని నసీర్ అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేశారు. బస్‌యాత్ర కోసం తెలుగుదేశం పార్టీ తయారు చేసిన పాటలను కాకుండా సొంత డీజేలో తమ పాటలు పెట్టుకుని యాత్ర నడిపించడం పట్ల కార్యక్రమానికి హాజరైన సీనియర్ నేతలు అభ్యంతరం చెప్పారు. అనంతరం రామయ్య కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన వర్తకుల సమావేశం ఫ్లెక్సీలలో పార్టీ జిల్లా, నగర అధ్యక్షుల ఫోటోలు వేయకపోవడంపై డేగల ప్రభాకర్ అభ్యంతరం చెప్పారు. దీనిపై నసీర్ అహ్మద్ వాగ్వాదానికి దిగారు. ఇద్దరూ కొట్టుకునే వరకూ పరిస్థితి వెళ్లింది. నసీర్ వ్యవహార శైలిపై పార్టీ సీనియర్లు, దాసరి రాజా మాస్టర్ కూడా ఆగ్రహంతో పార్టీ సిద్ధాంతాలు తెలియవా అంటూ గొడవకు దిగారు. దీంతో కార్యక్రమం రసాభాసగా ముగిసింది.

సీనియర్ల గుర్రు

సాయంత్రం పర్యటనలోనూ బస్‌కు ముందు ఓపెన్ టాప్ జీప్ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి జరుగుతున్న వ్యవహారంతో విసిగిపోయిన తెలుగుదేశం సీనియర్లు ఓపెన్ టాప్ జీప్ ఎక్కడానికి ఇష్టపడలేదు. ఆలపాటి రాజా మాత్రమే ఓపెన్‌టాప్ జీప్ ఎక్కగా మిగిలినవారు బస్‌లోనే ఉండిపోయారు. ఈ వ్యవహారంపై పార్టీ రాష్ట్ర కార్యాలయానికి కూడా ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం.

అర్జీలు రీ ఓపెన్ కాకుండానే పరిష్కరించాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: సుదూర ప్రాంతాల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజల అర్జీలలో కొన్నింటిని చిన్న చిన్న కారణాలతో పెండింగ్ పెడుతున్నారని దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అకారణంగా అర్జీలను పెండింగ్‌లో పెడితే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ప్రతి వారం ఆయా శాఖాధికారులు స్పందన అర్జీలపై సమీక్ష చేసుకోవాలని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్ళి సమస్యలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కౌలు రైతులకు నూరు శాతం సీసీఆర్సీ కార్డులు ఈనెల 31లోపు అందజేయాలని చెప్పారు. అనంతరం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 170 అర్జీలను కలెక్టర్, జేసీ, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్వో చంద్రశేఖర రావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వెంకట శివరామి రెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.

చిన్నారులకు ఆధార్ అందించండి

జిల్లాలో ప్రస్తుతం చిత్తుకాగితాలు ఏరుకుని జీవించే వారు సుమారు 500 వరకు ఉంటారు. వీరికి స్థిర నివాసమంటూ లేదు. దీంతో వీరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందడంలేదు. వారి పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ అందిస్తే వారికి ప్రభుత్వ విద్యతోపాటు కనీస సదుపాయాలు అందుతాయి.

– బహుజన రిసోర్స్ సెంటర్ నాయకులు, చిన్నారులు, గుంటూరు



తగ్గిన గంజాయి సరఫరా

మరో ఇద్దరిపై పీడీ చట్టం



ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం, పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలను తీసుకుంటున్నట్టు ఎస్పీ కె.ఆరీఫ్‌హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ ఏపీని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులను అరెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. మంగళగిరి రూరల్ పీఎస్ పరిధిలో గంజాయి తాగి విక్రయించే నలుగురు యువకులను అరెస్ట్ చేయగా, వారికి సరఫరా చేసిన చింతపల్లి వాసి మోహన్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారని వివరించారు. ఏపీలో గంజాయి సరఫరా తగ్గిందని, ఇటీవల నమోదైన కేసుల్లో వ్యక్తులను విచారించగా, ఒడిశా, మల్కాజ్‌గిరి నుంచి తీసుకువస్తున్నట్లు తెలిసిందని వెల్లడించారు. అయినా ఎస్‌ఈబీ భాగస్వామ్యంతో పోలీస్ శాఖ నిరంతర నిఘా పెట్టిందని పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో పలుమార్లు అరెస్టైన ఐదుగురిపై గతంలో పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశామన్నారు. తాజాగా తాడేపల్లి పీఎస్ పరిధిలో వి.రోజాపై, పెదకాకాని పీఎస్ పరిధిలో ఎం.రమణరావుపై పీడీ చట్టం ప్రయోగించామని తెలిపారు. ఇటీవల జరిగిన హత్యలకు నగదు, వివాహేతర సంబంధాలు, వ్యక్తిగత విషయాలే కారణమని వివరించారు. రౌడీషీటర్ల నేపథ్యంలో హత్యలు జరగడంలేదని స్పష్టం చేశారు.

8,9 తేదీల్లో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల సమీపంలోని కేఎస్‌ఆర్ కాన్వోనియం క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేశామని వివరించారు. ఈ నెల 7వ తేదీలోపు తమ ఎంట్రీలను పంపించాలని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు ఇతర వివరాలకు 93482 30112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శాకంబరీ.. మనసా స్మరామీ

- పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు
- మూడు రోజుల్లో 1.60 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు అంచనా
- కొనసాగిన ఆషాఢ సారె సమర్పణలు



అమ్మవారి ఉత్సవ మూర్తికి పండ్లతో అలంకరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శాకంబరీదేవి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం 8 గంటలకు సప్తశతి హవనం, మహా విద్యా పారాయణం, శాంతి పౌష్టిక హోమాలు, మండప పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించగా, చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈవో భ్రమరాంబ, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన దాతలు, రైతులు, వ్యాపారులకు అందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆలయ అధికారులు పేర్కొన్నారు. మూడు రోజుల్లో సుమారు 1.60 లక్షల మంది భక్తులు అమ్మవారిని శాకంబరీదేవిగా దర్శించుకున్నారని అంచనా వేస్తున్నారు.

కిక్కిరిసిన ఇంద్రకీలాద్రి..

ఉత్సవాలలో మూడో రోజైన సోమవారం అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కాయలు, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు. ప్రధాన ఆలయంతో పాటు లోపల, వెలుపల, ఆలయ ప్రాకారం చుట్టూ బత్తాయి, పైనాపిల్, పుచ్చకాయలు, ద్రాక్షలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాజగోపురం ఎదుట ఐస్ దిమ్మెలతో తయారు చేసిన శివలింగం ఆకృతి భక్తులను ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు దేవస్థానం కదంబం ప్రసాదాన్ని అందజేసింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థాన అధికారులు, పాలక వర్గం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

అమ్మవారి సన్నిధిలో శ్రీలంక ప్రతినిధులు

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శాకంబరీదేవిగా శ్రీలంకకు చెందిన పలువురు ప్రతినిధులు దర్శించుకున్నారు. శ్రీలంక ఈస్టర్న్ ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండమాన్, శ్రీలంక డెప్యూటీ హై కమిషనర్ డాక్టర్ డి.వెంకటేశ్వరన్ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబలు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

దుర్గమ్మ సేవలో తెలంగాణ సీఎల్పీ నేత

తెలంగాణ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క దంపతులు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భట్టి విక్రమార్కకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. మహానివేదన అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న ఆయనకు అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

మనసారా.. కొలి'సారె'

పెనుగ్రంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానం నుంచి దుర్గమ్మకు ఆషాఢ సారెను సమర్పించారు. తిరుపతమ్మ ఆలయ చైర్మన్ చిన్నకేశవరావు, ఈవో కె. రమేష్‌నాయుడితోపాటు ఆలయ అధికారులు సిబ్బంది రథం సెంటర్ నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి ఆలయానికి చేరుకున్న తిరుపతమ్మ దేవస్థాన అధికారులకు దుర్గగుడి చైర్మన్, రాంబాబు, ఈవో భ్రమరాంబ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం చీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, ఆలయ అర్చకులకు అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి ప్రసాదాలను అందించారు.

ముత్యాల పందిరిలో విహరించె





ఊరేగింపులో స్వామిదేవేరులు, ముత్యాల పందిరి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు

నిండుపున్నమి వేళ.. ముత్యాల పందిరిలో.. దేవేరులతో కలిసి సర్వాంగ సుందరంగా ముస్తాబైన మంగళగిరి నృసింహుడు వెన్నెల వాకిళ్లలో విహరించాడు. భక్తజనులను దివ్య మంగళ స్వరూపంతో కటాక్షించాడు. ఫలితంగా భక్తిపారవశ్యం ఉప్పొంగింది. ఆధ్యాత్మికోత్సాహం పరవళ్లు తొక్కింది. గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో ముత్యాల పందిరి ఊరేగింపు వైభవంగా జరిగింది. కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి స్వామి, దేవేరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముత్యాల పందిరి ఊరేగింపు సేవలో పాల్గొన్నారు. ఇదిలా ఉంటే 1200 మంది కళాకారులతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది.

– మంగళగిరి

ఎస్పీ కార్యాలయానికి పెరిగిన ఆన్‌లైన్ బాధితులు

మొబైల్ ఫోన్ / జూమ్ ద్వారా సిబ్బందికి సూచనలు

నగరంపాలెం: ఎక్కువ కమిషన్ వస్తుందని ఆశ చూపి, లింక్‌ల పేర్లతో లక్షలు కాజేశారని కొందరూ.. ప్రభుత్వ ఉద్యోగం పేరుతో మోసగించారని ఓ బాధిత నిరుద్యోగి.. భర్త అధిక కట్నం తేవాలని వేధిస్తున్నట్లు భార్య.. ఇలా అనేక ఫిర్యాదులతో అర్జీదారులు జిల్లా ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులకు విన్నవించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక- స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల అర్జీదారులు వచ్చారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల బాధను ఆయన ఆలకించారు. ఫిర్యాదిదారుల ఎదుటనే సంబంధిత సబ్ డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులతో మొబైల్‌ఫోన్‌లో/ జూమ్ ద్వారా ఎస్పీ మాట్లాడారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులు పునరావృతంకాకుండా పరిష్కరించాలని చెప్పారు. ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు సుభాష్ (ఎస్‌బీ), బాలసుందర్ (ట్రాఫిక్), కేసీహెచ్.రామారావు (దిశ) కూడా అర్జీలు స్వీకరించారు.



బాధితుల సమస్యలు ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు

ఆన్‌లైన్‌లో రూ.25 లక్షలు పోగొట్టుకున్నా..

ప్రైవేటు కంపెనీలలో పెట్టుబడులు పెడితే అత్యధిక కమిషన్, డాలర్లు చెల్లిస్తామని మోసగించడంపై బాధితులు వేర్వేరుగా ఫిర్యాదులిచ్చారు. జిల్లాలోని ఓ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తించే ఓ ఉద్యోగికి మే ఒకటిన వాట్సప్ మేసేజ్ వచ్చింది. ఉత్పత్తులు విక్రయిస్తే కమిషన్ రూపేణా డాలర్లు చెల్లిస్తామని, దీనికై ఓ వెబ్‌సైట్‌లో రీచార్జ్ చేయాలని అందులోని సారాంశం. ఒక్కొక్క ఉత్పత్తికి ఒక్క టాస్క్ చొప్పున అరవై టాస్క్‌లు. దీంతో ఓ యాప్ ద్వారా రూ.3 లక్షలు చెల్లించాడు. అనంతరం అరవై టాస్క్‌లు పూర్తయినా కమిషన్ (డాలర్లు) చెల్లించలేదు. అదేమని అడిగితే లెవల్-2 అప్‌గ్రేడ్‌కు వెళ్లారని, మరో అరవై టాస్క్‌లు చేయాల్సి ఉందన్నారు. అందులో భాగంగా రీఛార్జ్ పేరుతో రూ.22 లక్షలు చెల్లించా. అయినా కమిషన్ చెల్లించకపోవడంపై అడగ్గా, ఆలస్యంగా చేశారని బదులిచ్చారు. దీంతో ఆన్‌లైన్‌లో మోసపోయినట్లు గుర్తించి డబ్బులు అడిగితే ఇవ్వడంలేదు. ఈ విషయమై న్యాయం చేయగలరు.

– ఆర్టీసీ ఉద్యోగి

కారకులపై చర్యలు తీసుకోవాలి

భర్త రామకృష్ణ ఎలక్ట్రీషియన్ పనులకు వెళ్లేవాడు. ఈనెల ఒకటిన గుంటూరు నగరంపాలెంలోని ఓ బ్యాంక్‌లో విద్యుత్ పనులకు వెళ్లగా, విద్యుత్ షాక్‌కు గురై భర్త మృతిచెందినట్లు బ్యాంక్ నుంచి కాల్ చేశారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లగా భర్త మృతదేహం చెల్లాచెదురుగా పడిఉంది. అయితే బ్యాంక్‌లో సాయంత్రం 6–7 గంటల వ్యవధిలో ఎలా మృతి చెందాడు, కారకులైన గుత్తేదారు, బ్యాంక్ మేనేజర్‌పై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, అలాగే రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలి.

– మృతుడి భార్య అనంతలక్ష్మి, ప్రజా సంఘాల నాయకులు భగత్‌సింగ్, జూపూడి శ్రీనివాసరావు, సాంబశివరావు

లింక్‌తో..

ఇటీవల మొబైల్‌కు ఓ లింక్ వచ్చింది. లింక్ పంపించిన వ్యక్తికి ఎందుకు పంపించారని అడగ్గా, ఓ ప్రైవేటు కంపెనీ ఏజెంట్‌నని పాఠశాల ఉపాధ్యాయుడు పరిచయమయ్యారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని, గతంలో అతనికి వచ్చిన లాభాలను చూపించి నమ్మించాడు. ఆర్థిక, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా గతనెల 7, 14, 24 తేదీల్లో రూ.1.22 లక్షలు చెల్లించా. వారం గడిచాక యాప్‌ను తొలగించారు.

– జి.అరుణకుమారి, అదవిత క్కెళ్ళపాడు

రూ.1.10 లక్షలు కాజేశారు!

ఓ మొబైల్ దుకాణం నుంచి ఫోన్‌కు యాప్ లింక్ వచ్చింది. అందులో రూ.11 వేలు పెట్టుబడి పెడితే రోజు రూ.451 చెల్లిస్తారని, 4 నెలల్లో 63 వేలు వస్తాయని చెప్పారు. రూ.1.10 లక్ష చెల్లిస్తే, రోజుకి రూ. 4,950 చొప్పున 8 నెలల్లో రూ.13.40 లక్షలు జమ అవుతాయని నమ్మబలికారు. దీంతో గతనెల 17న రూ.1,10,000 చెల్లించా. అప్పటి నుంచి ఎటువంటి స్పందన లేదు.

– వై.నవీన్, బెల్లంకొండ

కట్నం పేరుతో..

గతేడాది డిసెంబర్‌లో పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా కందుకూరు వాసితో పెళ్లయింది. కట్నం కింద రూ.3 లక్షలు ఇచ్చాం. ఇంకా కట్నం కావాలని అడిగితే ఇటీవల రూ.50 వేలు ఇచ్చారు. అయినప్పటికీ డబ్బు తేవాలని చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. అసభ్యంగా మాట్లాడటం, దాడి చేయడం చేస్తున్నాడు. ఇటీవల అత్తారింటి నుంచి వచ్చేశా. భర్త క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడేవాడు. ఈ క్రమంలో అధిక కట్నం కోసం వేధిస్తున్నాడు.

– ఓ వివాహిత, పొన్నూరు

ఉద్యోగం ఇప్పిస్తానంటే రూ.3 లక్షలిచ్చా..

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటే తెలిసిన వ్యక్తికి రూ.3 లక్షలు ఇచ్చా. దీనిపై జిల్లా స్పందనలో ఫిర్యాదిచ్చా. అక్కడ పోలీసుల వద్దకు కెళ్తే సదరు వ్యక్తిని పిలిపించారు. ఈలోగా మరో వ్యక్తి వచ్చి డబ్బులు తీసుకున్న వ్యక్తిని పూచీకత్తుపై తీసుకెళ్లాడు. నెలలు గడిచినా డబ్బులివ్వడం లేదు. అదేమని అడిగితే అవతలి వ్యక్తులు బెదిరిస్తున్నారు.

– కె.రత్నరాజు, పొన్నూరు

చిన్నారులంతా బడుల్లోనే ఉండాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని 5 నుంచి 15 ఏళ్ల వయస్సున్న పిల్లలు పాఠశాల్లో విద్యనభ్యసించే విధంగా డ్రాపవుట్స్ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బంది, విద్యాశాఖాధికారులపైనే ఉందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంత మంది డ్రాపవుట్స్ ఉన్నారో ఈ గురువారం లోపు నిర్ధారించి, వారిని శనివారం లోపూ పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుకోవాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం మన బడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పఠశాలలను ఆధునీకరిస్తుందన్నారు. చిన్నారులు పాఠశాలలకు వెళితే చక్కని విద్యతోపాటు బలవర్ధకమైన ఆహారం కూడా అందుతాయని చెప్పారు. నిరక్ష్యరాస్యులైన తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను సిబ్బంది తెలియజెప్పాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేకున్నారన్న సత్యాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలన్నారు. జగనన్న విద్యా కిట్లు నూరు శాతం పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లోనూ, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించాలన్నారు. ముఖ్యంగా రక్త హీనత ఉన్నవారికి తగిన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

ప్రేమ విఫలమై యువకుడు..

తెనాలిరూరల్: ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ పాండు రంగపేటకు చెందిన ఉదయ్‌బాబు (19) ఓ యువతిని ప్రేమించాడు. యువతికి ఆమె తలిదండ్రులు వేరే వివాహం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన అతను ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు పంపగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్‌సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపారు.

మందలించారని యువతి..



ఆత్మహత్యకు పాల్పడిన వసుంధర

పట్నంబజారు: శ్రద్ధగా చదవాలని తల్లిదండ్రులు మందలించినందుకు ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బావాజీనగర్‌కు చెందిన మానిక వసుంధర (19) సంగడిగుంటలోని ఒక ప్రైవేట్ కళాశాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తోంది. తల్లితండ్రులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో వసుంధర సరిగా చదవకపోవటం, సెల్‌ఫోన్‌లు అధికంగా చూస్తుండంటో సరిగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని సోమవారం నివాసంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వసుంధర తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఆదిజాంబవ మహర్షి గురుపూజోత్సవం



మంత్రి అంబటికి జ్ఞాపిక ఇచ్చి సన్మానిస్తున్న దృశ్యం

పాత గుంటూరు: అరండల్‌పేటలోని మోహన రంగ నాయక స్వామి దేవస్థానంలో గురు పౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆది జాంబవ మాదిగ మహర్షి గురు పూజోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరి రావు పాల్గొన్నారు. మహామునికి పూజలు, హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

4.57 కిలోల గంజాయి, స్కూటీ స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, పక్కన ఏఎస్పీ మహేష్, మంగళగిరి రూరల్ పీఎస్ సీఐ భూషణం

నగరంపాలెం: గంజాయికి బానిసై విక్రయించే నలుగురు కుర్రాళ్లను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 4.570 కిలోల గంజాయి, స్కూటీ సీజ్ చేశారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణ విక్రయాలు, వినియోగ నియంత్రణలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు. డ్రైవ్‌లో భాగంగా ఆదివారం సాయంత్రం చినకాకాని కంతేరు రోడ్ వేప చెట్టు వద్ద గంజాయి విక్రయించే నలుగురు కుర్రాళ్లను గుర్తించారు. మంగళగిరి ప్రాతూరు గ్రామ వాసి బండ్ల ప్రశాంత్, పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలోని సూళ్ళూరుపేట బాపుజీనగర్‌కు చెందిన ఈదులమూడి సాత్విక్, తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామానికి చెందిన మొండితోక రత్నతేజ, మొండితోక రజనీకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరం రుజువుకావడంతో ఆ నలుగురిని అరెస్ట్ చేసి, రూ. 4.570 కిలోల గంజాయి, 136 తెల్లని కాగితాలు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. వీరికి చింతపల్లి మండలం నుంచి గంజాయిని విక్రయించిన సరఫరాదారుడు మోహన్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో ప్రధాన సూత్రధారి అయిన శృంగారపాటి ప్రవీణ్ అలియాస్ భాష, ప్రశాంత్ స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసై, గంజాయి తాగేవారు. అధిక డబ్బులు సంపాదించాలనే దురాశతో గంజాయి విక్రయించడం ప్రారంభించారు. దీంతో చింతపల్లి మండలం డేగలవానిపాలెం గ్రామ వాసి మోహన్, అతని తల్లి వద్ద గంజాయి కిలోల చొప్పున కొనేవారు. అందులో కొంత తాగేవారు. మిగతా గంజాయి పొట్లాట మాదిరిగా చేసి అధిక ధరలకు విజయవాడ, తాడేపల్లి, మంగళగిరిలోని కుర్రాళ్లకు విక్రయించే వారు. వారి అనుచరులైన సాత్విక్, రత్నతేజ, రజనీకుమార్, దాస్‌లు కూడా విక్రయించే వారిలో ఉన్నారు. తద్వారా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఇటీవల ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో గాయాలై, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నలుగురిని అరెస్ట్ చేసిన పోలీస్ అధికార, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ (ఎస్ఈబీ-సెబ్) డీఎస్.మహేష్, సీఐ వి.భూషణం, ఎస్ఐ జె.క్రాంతికిరణ్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బస్సులపై రవాణ శాఖ కేసులు

పట్నంబజారు: జిల్లా వ్యాప్తంగా రవాణ శాఖ అధికారులు సోమవారం విద్యా సంస్థల బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల ప్రారంభమైనప్పటి నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు పాటించని 50 బస్సులపై ఇప్పటి వరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

తహసీల్దారు కె.సుజాతకు డీటీగా రివర్షన్

గుంటూరు వెస్ట్: అక్రమార్కులపై రెవెన్యూ శాఖ సీసీఎల్ఏ కొరడా ఝుళిపిస్తోంది. గతంలో వట్టిచెరుకూరు తహసీల్దారుగా పనిచేసి ప్రస్తుతం బాపట్ల కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కె.సుజాతకు డెప్యూటీ తహసీల్దారుగా రివర్షన్ ఇచ్చింది. ఆమె వట్టిచెరుకూరు తహసీల్దారుగా ఉన్న సమయంలో కొన్ని ప్రభుత్వ భూములను అక్రమంగా ఇతరులకు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. దీనిపై విచారించిన అధికారులు వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చారు. ఇటీవల తెనాలి తహసీల్దారుగా పనిచేసిన రవిబాబును సైతం ఇటువంటి అభియోగాలపై డీటీగా రివర్షన్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

సంచార పశు ఆరోగ్య రథాల్లో ఉద్యోగాలు

గుంటూరు మెడికల్: జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాల్లో పైలెట్, డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశు ఆరోగ్య సేవా రథాల జిల్లా మేనేజర్ ఎస్.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో కోరారు. డాక్టర్లుగా పనిచేయడానికి బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. అర్హత ఉన్నవారు 9618836074 నంబరులో సంప్రదించాలని కోరారు.

వేధిస్తున్న భర్తకు దిశ కౌన్సెలింగ్

పట్నంబజారు: కవల ఆడపిల్లలు జన్మించారని భార్య, అత్తామామలతో ఘర్షణకు దిగిన వ్యక్తిపై దిశ ఎస్‌వోఎస్‌కు ఫోన్ కాల్ చేసిన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. పాతగుంటూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎంవీ సుబ్బారావు కథనం ప్రకారం.. ఆనందపేటకు చెందిన నాగూర్‌ఖాన్, బేగంకు గత ఏడాది వివాహం జరిగింది. వీరికి ఇటీవలి కాలంలో ఇద్దరు కవల ఆడపిల్లలు జన్మించారు. ఆడ పిల్లల జన్మించారని ఆదివారం రాత్రి సమయంలో నాగూర్‌ఖాన్ ఆడపిల్లలు అయితే ఇంటికి భారమని భావించి, అధికకట్నం ఇవ్వాలని అత్తమామలపై ఘర్షణకు దిగాడు. దీంతో బాధితులు దిశ ఎస్‌వోఎస్ ఫోన్ చేసిన నిముషాల వ్యవధిలో పోలీసులు అక్కడకు చేరుకుని, ఘర్షణకు దిగిన నాగూర్‌ఖాన్‌ను స్టేషన్‌కు తరలించారు.

తొమ్మిది మండలాల్లో వర్షం

చేబ్రోలులో 37.2 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): నైరుతి రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు తొమ్మిది మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా చేబ్రోలు మండలంలో 37.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా అత్యల్పంగా తాడికొండ మండలంలో 1 మి.మీ వర్షం పడింది. సగటున 5.4 మి.మీ వర్షపాతం నమోదైంది. పెదకాకాని 21 మి.మీ., గుంటూరు తూర్పు 16, పొన్నూరు 9.8, ప్రత్తిపాడు 6, గుంటూరు పశ్చిమ 2.4, వట్టిచెరుకూరు 2.2, పెదనందిపాడు మండలంలో 1.2 మి.మీ చొప్పున వర్షం పడింది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో జిల్లాలోని వివిధ మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: కృష్ణాకెనాల్ జంక్షన్ క్వార్టర్స్‌లో నివాసముండే ఓ రైల్వే ఉద్యోగి తను నివాసముంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ వినోద్ కథనం ప్రకారం శ్రీకాకుళంకు చెందిన హేమ సుందరరావు (37) కృష్ణా కెనాల్ జంక్షన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. స్థానికులు సుందరరావు బయటకు రాకపోవడంతో కిటికీలోంచి చూడగా ఉరివేసుకుని కనబడ్డాడు. దీంతో తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
4-7-2023

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
486	134
65,205	19,323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్ఈ 100	7,527	▽	4
డాక్స్	16,081	▽	67
షాంఘై	3,244	▲	42
నికాయ్	33,753	▲	564

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	57,730
బంగారం (22 క్యారట్)	54,980
వెండి (కిలో)	75,500

సెన్సెక్స్ @ 65000

- 19,300 పైకి నిఫ్టీ
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఇంధన, ఆర్థిక, మెటల్ షేర్లకు డిమాండ్
- మూడోరోజూ కొత్త రికార్డుల నమోదు



సెన్సెక్స్ మైలురాళ్లు

స్థాయి	అందుకున్న తేదీ
65,000	జూలై 03 2023
64,000	జూన్ 28 2023
63,000	నవంబర్ 30 2022
62,000	అక్టోబర్ 19 2021
61,000	అక్టోబర్ 14 2021

ముంబై: సానుకూల జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ సోమవారమూ కొనసాగింది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్ ద్వయం షేర్లు రాణించడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 117 పాయింట్ల లాభంతో 64,836 వద్ద మొదలైంది. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 19,247 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. తొలి గంట తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంధన, ఆర్థిక, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా మూడోరోజూ సెన్సెక్స్ 581 పాయింట్లు పెరిగి 65,300 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు బలపడి 19,345 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. చివరికి సెన్సెక్స్ 486 పాయింట్ల లాభంతో 65,205 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు. మార్కెట్ ముగిసేసరికి 134 పాయింట్లు బలపడి 19,323 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.56%, 0.30% చొప్పున లాభపడ్డాయి. జూన్ వాహన విక్రయాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఆటో షేర్లు నష్టపోయాయి. ఐటీ, టెక్, విద్యుత్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.1.73 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ.2.98 లక్షల కోట్లకు చేరింది. ద్రవ్యోల్బణం దిగిరావడంతో కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల సైకిల్‌ను ఆపేయ్యొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఆసియాలో జపాన్ ఇండెక్స్ నికాయ్ 33 ఏళ్ల గరిష్టం(33,753) ముగిసింది.

''మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీతో పలు షేర్ల వాల్యుయేషన్లు భారీగా పెరిగాయి. నిఫ్టీ ఎఫ్‌వై 24 ఆదాయ అంచనాకు 20 రెట్ల అధిక ప్రీమియంతో ట్రేడవుతోంది. ఇది చరిత్రాత్మక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుతం నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే వీలుంది. ఏదైన చిన్న ప్రతికూలాంశం అనూహ్య దిద్దుబాటుకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడులు పెట్టేటప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ కుమార్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విలీనం తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు సానుకూలంగా స్పందించాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు వరుసగా 4%, 3% చొప్పున ర్యాలీ చేసి రూ.2,926 వద్ద, రూ.1,758 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకాయి. చివరికి హెచ్‌డీఎఫ్‌సీ షేరు 2% లాభంతో రూ.2,871 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒక శాతం పెరిగి రూ.1,719 వద్ద స్థిరపడింది. మొత్తంగా ఈ రెండు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.93 లక్షల కోట్లకు పెరిగింది.
- ఎన్ఎస్ఈలో బ్యాంక్ నిఫ్టీ సూచీ ఏడాది గరిష్టం (45,353) తాకింది. చివరికి ఒకశాతం లాభంతో 45,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండెక్స్ సైతం 52 వారాల గరిష్టం(20,398) అందుకొని ఆఖరికి 1% లాభంతో 20,253 వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం జీవితకాల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి.

జియో భారత్ ఫోన్ @ రూ. 999

రూ. 123 నెలవారీ ప్లాన్‌తో అపరిమిత కాల్స్, 14 జీబీ డేటా



న్యూఢిల్లీ: టెలికం సంస్థ జియో తాజాగా ఇంటర్నెట్ ఆధారిత చౌక 'జియో భారత్' మొబైల్ ఫోన్లను ఆవిష్కరించింది. దీని ధర రూ. 999. నెలవారీ రీచార్జి రూ. 123గా ఉంటుంది. దీనితో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది. జూలై 7 నుంచి 10 లక్షల పైచిలుకు జియో భారత్ ఫోన్ల ప్రయోగాత్మక ట్రయల్స్ ప్రారంభమవుతాయని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర ఆపరేటర్లు అందిస్తున్న ఫీచర్ ఫోన్ నెలవారీ ప్లాన్లతో పోలిస్తే 30 శాతం చౌకగా, 7 రెట్లు ఎక్కువ డేటాను యూజర్లు పొందవచ్చని పేర్కొంది. 2జీ విముక్త భారత్ లక్ష్య సాధనను వేగవంతం చేసే దిశగా జియో ఈ మొబైల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు 2జీ ఫీచర్ ఫోన్లను వాడుతున్నారని అంచనా. ఒకవైపు ప్రపంచం 5జీ విప్లవం ముంగిట నిల్చుండగా.. 25 కోట్ల మంది ఇంకా 2జీ శకంలోనే చిక్కుబడిపోయి ఉన్నారని, ప్రాథమిక ఇంటర్నెట్ ప్రయోజనాలను కూడా పొందడం లేదని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. డిజిటల్ సమాజంలో.. టెక్నాలజీ ప్రయోజనాలు ఏ కొందరికో పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జియో భారత్ ఫోన్ మరో ముందడుగని ఆయన పేర్కొన్నారు.

ప్రియం కానున్న టాటా కార్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించింది. సగటున 0.6 శాతం ధర పెంచుతున్నట్టు సోమవారం వెల్లడించింది. తయారీ వ్యయం పెరగడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్‌తోసహా అన్ని మోడళ్లు, వేరియంట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. కొత్త ధరలు జూలై 17 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ తెలిపింది. జూలై 16 వరకు నమోదయ్యే బుకింగ్స్, జూలై 31లోగా జరిగే డెలివరీలకు పాత ధరలు వర్తిస్తాయని వెల్లడించింది

మైక్రోచిప్.. రూ.2,460 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంబెడెడ్ కంట్రోల్ సొల్యూషన్స్‌లో ఉన్న యూఎస్ కంపెనీ మైక్రోచిప్ టెక్నాలజీ భారత్‌లో రూ.2,460 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణ, ఇంజనీరింగ్ ల్యాబ్స్, నిపుణుల నియామకం, సాంకేతిక కేంద్రాలకు మద్దతు, విద్యా సంస్థలకు ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. కాగా, ఇక్కడి కోకాపేట్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న వన్ గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 5 అంతస్తులను కంపెనీ కొనుగోలు చేసింది. పరిశోధన, అభివృద్ధి కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చింది. ఈ కేంద్రంలో 1,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. భారత్‌లో కార్యకలాపాలను పెంపొందించడానికి మైక్రోచిప్ ముఖ్యమైన వ్యూహాత్మక నిబద్ధతను ప్రకటించిందని సంస్థ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్ మూర్తి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇండస్ట్రియల్, డేటా సెంటర్, కంప్యూటింగ్, ఆటోమోటివ్, కంస్యూమర్ అప్లయాన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు మైక్రోచిప్ సేవలు అందిస్తోంది.

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ ప్రారంభం..

తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల లావాదేవీలు



గాంధీనగర్: సింగపూర్ ఎస్‌జీఎక్స్ నిఫ్టీ స్థానంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ నిఫ్టీలో సోమవారం నుంచి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఎస్‌జీఎక్స్ నిఫ్టీకి సంబంధించిన 9.4 బిలియన్ డాలర్ల ఓపెన్ ఇంట్రెస్ట్‌ను గిఫ్ట్ నిఫ్టీకి బదలాయించగా.. మొదటి రోజున తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల విలువ చేసే లావాదేవీల పరిమాణం నమోదైంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గిఫ్ట్ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు తమ ట్రేడింగ్‌లో కొంత భాగం విదేశాల్లో జరిగేదని, ఇప్పుడిక పూర్తిగా దేశీయంగానే నిర్వహించవచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ ఆశీష్ చౌహాన్, ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ వి. బాలసుబ్రమణియమ్ తెలిపారు.

రెండు సెషన్లలో.. దాదాపు 21 గంటలు..

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్ల మారకంలో జరుగుతుంది. ఉదయం 6.30 గం.ల నుంచి మరుసటి రోజు 2.45 గం.ల వరకు రెండు సెషన్లుగా, దాదాపు 21 గంటల పాటు ఇందులో ట్రేడింగ్ కొనసాగుతుంది. తొలుత గిఫ్ట్ నిఫ్టీ 50, గిఫ్ట్ నిఫ్టీ బ్యాంక్, గిఫ్ట్ నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గిఫ్ట్ నిఫ్టీ ఐటీ డెరివేటివ్ కాంట్రాక్టులు ఎన్ఎస్ఈ ఐఎక్స్‌లో అందుబాటులో ఉంటాయి. తర్వాత మరిన్ని సూచీలను క్రమంగా అందుబాటులోకి తెస్తారు. సాధారణంగా దేశీ మార్కెట్ల ఓపెనింగ్‌ను అంచనా వేసేందుకు ట్రేడర్లు ఎస్‌జీఎక్స్ నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఓకే

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాతృ సంస్థ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం కానుంది. పూర్తిగా షేర్ల మార్పిడి ద్వారా లావాదేవీని చేపట్టనున్నారు. ఇందుకు రెండు సంస్థల బోర్డులూ ఆమోదించినట్లు ఐడీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తాజాగా వెల్లడించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు జారీ చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగానికి రుణాలందించే ఐడీఎఫ్‌సీ 1997లో ఆవిర్భవించింది. 2015లో ఐసీఐసీఐ, ఐడీబీఐ తరహాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్‌లో క్యాపిటల్ ఫస్ట్‌ను టేకోవర్ చేసింది.

పవన్ హన్స్ విక్రయం రద్దు

గెలుపొందిన బిడ్డర్ అనర్హత ఎఫెక్ట్



న్యూఢిల్లీ: హెలికాప్టర్ సర్వీసుల పీఎస్‌యూ పవన్ హన్స్ లో వ్యూహాత్మక వాటా విక్రయానికి బ్రేక్ పడింది. బిడ్డింగ్‌లో విజయవంతమైన కన్సార్షియంలోని ఒక కంపెనీపై న్యాయపరమైన వివాదాల రీత్యా అనర్హతవేటు పడటం దీనికి కారణమని దీపమ్ పేర్కొంది. వెరసి పవన్ హన్స్ ప్రయివేటైజేషన్ ప్రయత్నాలకు మూడోసారి చెక్ పడింది. బిడ్‌ను గెలుపొందిన స్టార్9 మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ కన్సార్షియంలోని అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం పవన్ హన్స్ డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు దీపమ్ తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ పవన్ హన్స్‌లో ప్రభుత్వానికి 51 శాతం, ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీకి 49 శాతం చొప్పున వాటా ఉంది.

2018లో షురూ: తొలుత పవన్ హన్స్ లో గల 51 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం 2018లో బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. అయితే ఓఎన్‌జీసీ సైతం 49 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధపడటంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 2019లో తిరిగి కంపెనీలో 100 శాతం వాటా విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించినప్పటికీ స్పందన లభించకపోవడం గమనార్హం! ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో మూడోసారి పవన్ హన్స్ విక్రయానికి తెరతీసింది. కంపెనీ కొనుగోలుకి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానించింది. 2022 ఏప్రిల్‌లో స్టార్9 మొబిలిటీ కన్సార్షియం గరిష్ట బిడ్డర్‌గా నిలిచింది. కన్సార్షియంలో అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీసహా.. బిగ్ చార్టర్ ప్రయివేట్ లిమిటెడ్, మహరాజ ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సైతం భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1000 మేనేజర్ స్కేల్-2 పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో మెయిన్ స్ట్రీమ్ కేటగిరీలో మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1000
» **అర్హత:** ఏదైనా డిగ్రీ,సీఏఐఐబీ ఉత్తీర్ణులై ఉండాలి. పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో ఆఫీసర్‌గా మూడేళ్ల పని అనుభవం ఉండాలి(లేదా) పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో క్లర్క్‌గా ఆరేళ్ల పని అనుభవంతోపాటు సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంసీఏ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.05.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
» **పోస్టింగ్ స్థలం:** దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.07.2023
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:**ఆగస్టు రెండు/మూడో వారం
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

ఐబీపీఎస్ 4,045 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ) -XIII.. క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:**4,045 క్లర్క్ పోస్టులు
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఉంటుంది. మొదట 100 మార్కులకు ప్రిలిమ్స్, రెండో దశలో 200 మార్కులకు మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది.
» **ప్రిలిమినరీ పరీక్ష తేది:**2023 ఆగస్టు/సెప్టెంబర్‌లో
» **మెయిన్స్ పరీక్ష తేది:** అక్టోబర్ 2023లో నిర్వహిస్తారు
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.07.2023
» **వెబ్‌సైట్:** www.ibps.in

కేజీబీవీల్లో 1241 కొలువులు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్)ల్లో 1241 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూన్ 26 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోస్టుల సంఖ్య, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష స్వరూపం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



పోస్టుల వివరాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్వో), పోస్టు గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(పీజీ సీఆర్‌టీ), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులు; అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ ఎస్)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్వో), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ) పోస్టులు భర్తీ చేయనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 1241

- **కేజీబీవీ-పోస్టులు 1218:** స్పెషల్ ఆఫీసర్-38, పీజీ సీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీ సీఆర్‌టీ(మ్యాథమేటిక్స్)-60, పీజీ సీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీ సీఆర్‌టీ(తెలుగు)-104, పీజీ సీఆర్‌టీ(ఉర్దూ)-2, పీజీ సీఆర్‌టీ(బోటనీ)-55, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69,పీజీ సీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీ సీఆర్‌టీ(కామర్స్)-70, పీజీ సీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీ సీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీ సీఆర్‌టీ(జువాలజీ)-54, సీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ (మ్యాథమెటిక్స్)-45,సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77.
- **యూఆర్ఎస్-మొత్తం పోస్టులు-23:** స్పెషల్ ఆఫీసర్-4,సీఆర్‌టీ(తెలుగు)-5, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-5,సీఆర్‌టీ(సైన్స్)-6,సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-3

విద్యార్హతలు

- **పీజీసీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి.
- **స్పెషల్ ఆఫీసర్:** కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణత సాధించాలి.
- **సీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేయాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణతఉండాలి.
- **పీఈటీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం ఏడాది వ్యవధి ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ)లో ఉత్తీర్ణత సాధించాలి.
- కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీ, పీఈటీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దివ్యాంగులు అనర్హులు.

వయసు

2023 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ప్రతిభ, టెట్ స్కోరు, అనుభవం ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్షలో అర్హత సాధించాలంటే.. ఓసీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. పీఈటీ పోస్టులకు రాతపరీక్షలో మార్కుల(100 శాతం వెయిటేజీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష స్వరూపం

- **పీజీసీఆర్‌టీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **స్పెషల్ ఆఫీసర్:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **సీఆర్‌టీ:** ఇందులో కూడా మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **పీఈటీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఫిజియాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** జూలై 5, 2023
- **రాత పరీక్ష తేది:** జూలై 2023
- **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in

ఐఐటీల్లో కొత్త కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా విద్యార్థుల కోసం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఐఐటీ గాంధీనగర్ బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును రూపొందించింది. ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-పాట్నాలో బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఐఐటీ బాంబేలో డ్యూయల్ డిగ్రీ ఇన్ క్వాంటం టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు తగిన కోర్సు ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల తీరుతెన్నులు, ప్రవేశం విధానం, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..



ఐఐటీ ఇండోర్

ఈ ఏడాది ఐఐటీ ఇండోర్ ఎక్కువ సంఖ్యలో కొత్త కోర్సులను ప్రారంభించింది. బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, బీటెక్ ఇన్ మ్యాథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్, బీటెక్ ఇన్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ ఇండోర్ ఈ కోర్సులలో ప్రవేశాలను ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐటీ పాట్నా

ఐఐటీ పాట్నా ఈ సంవత్సరం ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో కొత్తగా బీటెక్‌ను ప్రారంభించింది. ఫిజిక్స్‌లో ధ్వని శిక్షణ, విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలను పరిచయం చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. సమకాలీన ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ రెండింటిలో సమాన సామర్థ్యాలుండే నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే క్వాంటమ్ టెక్నాలజీలో ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐడీడీపీ)ను త్వరలో ప్రారంభించనుంది. ఈ కోర్సును సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం ఇన్ఫర్మేషన్ కంప్యూటింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(క్యూయూఐసీఎస్‌టీ) ఆఫర్ చేస్తోంది. ఐఐటీ బాంబేలో ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో చేరిన విద్యార్థులు ఐఐడీడీపీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ నిర్మాణం ఇంకా ఖరారు కానప్పటికీ.. రెండేళ్ల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సులో క్వాంటం టెక్నాలజీతోపాటు క్యూయూఐసీఎస్‌టీకి అనుబంధంగా ఉన్న పరిశోధనా బృందంతో చేపట్టే ప్రాజెక్ట్ వర్క్‌కు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇతర డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల మాదిరిగానే ఈ కొత్త కోర్సులో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తారు. బీటెక్ విద్యార్థులు సంబంధిత కోర్సు మూడవ సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్‌ను ఎంచుకోవచ్చు.

ఐఐటీ జోధ్‌పూర్

ఐఐటీ జోధ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్.. కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ విత్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. బేసిక్ సైన్స్, అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఈ కోర్సును తీసుకువచ్చారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణమైన స్పెషలైజేషన్ల ద్వారా వివిధ కెరీర్ మార్గాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల ఈ ప్రోగ్రామ్‌ను ఎనిమిది సెమిస్టర్‌లుగా విభజించారు.

ఐఐటీ హైదరాబాద్

ఐఐటీ, హైదరాబాద్.. బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్‌లో పరిశ్రమ ఆధారిత బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులు బయోలాజికల్ డేటాను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌లోనూ శిక్షణ పొందుతారు. ఇది ఎనిమిది సెమిస్టర్లు, నాలుగేళ్ల కాలవ్యవధి ఉన్న ఫుల్‌టైమ్ కోర్సు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకింగ్స్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.

ఐఐటీ గాంధీనగర్

ఐఐటీ, గాంధీనగర్.. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టింది. దీనిలోని కొన్ని సబ్జెక్టులు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లోని సబ్జెక్టులతో ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. చాలా సబ్జెక్టులు భిన్నంగా ఉన్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఏఐ,మెషిన్ లెర్నింగ్ లో విద్యార్థులు పట్టుసాధించేలా కరిక్యులాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఎలక్టివ్స్ సౌకర్యం ఉండటంతో విద్యార్థులు ఏఐకు చెందిన వివిధ విభాగాలు, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ తదితర అడ్వాన్స్‌డ్ ఏఐ అంశాలను ప్రత్యేకంగా ఎంచుకోవచ్చు.

ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అప్లయిడ్ ఏఐలో అద్భుత కెరీర్ సొంతం చేసుకోవచ్చు. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నాలుగేళ్లు, ఎనిమిది సెమిస్టర్‌లుగా పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా దీనిలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ పాట్నా, ఐఐటీ గువాహటిలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.